లాగింది—వాడి మనస్సును ఒక్క క్షణంలో చదివాడు. ఝుంఝ్మన పాదుక విసిరాడు.

ఆషాఢభూతిని ముసలమ్మలంతా చుట్టుకున్నారు. కవి పత్ని వాడికేక విని లోపలినించి వచ్చింది. మంచినీళ్ళిచ్చి వాడిని వోదార్చి పంపింది.

కవి అంతా చూస్తూ ఊరుకున్నాడు—అందరూ తన్ను దూషిస్తున్నారనికూడా తెలుసుకున్నాడు. అందరితోపాటు తనభార్య, కూతురుకూడా—కవి ఇక వినలేక 'దేవీ' అని పిచ్చికేక వేసి మూర్ఛపోయాడు. ఎంతో శుశ్రూష చేసిన మీదట రాత్రి పన్నెండుగంటలకి వారికి మళ్ళీ స్మృతివచ్చింది.

ఈమాటు కవి ఇంకో కొత్తవరం కోరాడు-'నిన్న జరిగిన విషయాలన్నీ మర్చిపోయేటట్టు చెయ్యమని.'

దేవి అనుగ్రహించింది.

---

# ప్రకృతి - పురుషుడు

"ఇం కెన్నాళ్ళకమ్మా నీపెత్తనం? కూతుర్నిక సంసారం దిద్దనివ్వరాదూ?" అని యెవరన్నా అంటే కస్తూరితల్లి రమామణి—"సారె! దానికి వదిలిపెడితే రొండుచేతుల్తో తినాల్సిందే!"-"నోట్లో నాలిక లేనిఘటం" "కాస్తె మెప్పుకు వుబ్బి తబ్బిబ్బులవుతుంది"-అడగనివాడిది పాపం, ఏదంటే అది పారవేస్తుంది!"-ఇలా తలావొక సమాధానం చెప్పేది. ఇరవైయేళ్లు వొచ్చినా కస్తూరికి సంసార మెలా గడుస్తున్నదో తెలియదు—కనీసం తెలుసుకోవాలని కూడా ప్రయత్నించ

లేదు. తల్లి చెప్పినట్టు నడుచుకోవడమే ఆమెపని. నడుచుకోక మాత్ర మేం చేస్తుంది? స్వబుద్ధి నుపయోగించినప్పుడెల్లా తిట్లు తిన్నది!

యద్దృశ్యం తన్నశ్యం.

తన జ్ఞాపకార్థం రమారమణి ఒక యిల్లూ రెండువందల రూపాయలూ మిగిల్చిపోయింది; ఇవికాక కస్తూరి శరీరంమీద పదితులాలబంగారం! ఈమూలధనంతో తనకు బొత్తిగా అనుభవంలేని జీవిత సంగ్రామం—కాదు వ్యాపారంలో దిగింది కస్తూరి. ఫలితం. రెండు సంవత్సరాలైనాక జమాఖర్చులు తేల్చుకుంటే గాక బాకీ యిల్లూ, కస్తూరీ.—యెడారిలాంటి ఆమె జీవితమూ మిగిలింది.

ఇంట్లో కొంత భాగం కస్తూరి యిదివరకే అద్దెకిచ్చింది. కొంతభాగమని పేరుగాని యిల్లంతా వాడుకున్నా ఆమె యేమీ అనదు. అవసరమైతే తనూ వాళ్లకిచ్చిన భాగం వాడుకుంటూవుండేది. వంటఇల్లు వేరే లేకపోవడంచేతనైతేనేమి ఏకారణంవల్లనైతేనేమి సంసారంతో యెవరూ వచ్చివుండే వాళ్లుకారు, పోతే కోర్టువ్యవహారాలుండి వచ్చినవాళ్ళూ. చికిత్సకొచ్చినబాపతూ తాత్కాలికంగా వుండిపోతూవుండే వాళ్ళు.

రామయ్యవచ్చి పదిరోజులైంది. కోర్టులో నాలుగైదు వ్యవహారాలు నడుస్తున్నాయట. అందుకని నెలరోజులకి తీసుకున్నాడు గది. మొదటి రెండుమూడురోజులు బయటికి వెళ్లేటప్పుడు గదికి తాళంవేసిపోతూ వుండేవాడు. కాని తర్వాత గొళ్లెంవేసి కస్తూరిని చూస్తూవుండమని చెప్పిపోయేవాడు.

అతను పగలు యింట్లోవుండడు ఉదయమే లేచి ప్లీడరుగా రింటికి వెళ్ళేవాడు. సాయంత్రం కోర్టునించే యింటికి తిరిగి వచ్చేవాడు. రాత్రి హోటలుకు పోవటానికి బద్ధకిస్తే కస్తూరే బతిమాలి భోజనం పెట్టేది.

ఒకనాడు రామయ్య కోర్టునించి పెందలాడే తిరిగివచ్చాడు. అతనికి తన గదివంక చూసేవరకూ ఆశ్చర్యమూ కోపమూ కలిగింది. దాన్నిండా పీకచుట్టలూ ఉమ్ములూ! రామయ్య, వాటి ఆధారంతో రీసెర్చి చేసుకుంటూ సృష్టి అదిదాకా పోయాడు. అతని కళ్ళముందు ఎన్నో యుద్ధాలూ, రాజ్య ధ్వంసాలూ కనపడ్డాయి.

తనకొచ్చినకోపాన్ని తాత్కాలికంగా దిగమింగి రామయ్య కస్తూరిని పిలిచి "ఏమిటిది" అని అడిగాడు.

"నరసయ్యగారు వొచ్చారు పొద్దున" అంది కస్తూరి.

"నర్సయ్యెవడు?"

"చేకూరు. రెండుమూడు నెల్లక్రితం యీగదిలో వుండి పోయారు,"

"ఉండిపోతే! ఇప్పుడు నాకింద వుండగా ఎందుకురావాలి?"

"ఏదో యిదివరకున్న చోటుగదా అని చూసిపోటాని కొచ్చారు. నేనే వుండమంటే కాసేపు వుండిపోయారు. అంత మాత్రానికి యేమెత్తుకుపోయారు మీ సొమ్ము! — ఐతే వుండండి, చుట్టపీకలూడ్చి సుభ్రంగా కడుగుతాను" అంటూ కస్తూరి చీపురుకోసం బయలుదేరింది.

రామయ్యకు ఎక్సుపార్టి డిక్రీ యిచ్చినట్లయింది. ఐనా "లాపాయింటు" వదల్లేదు.

"అదికాదు. నేను అద్దె యిస్తూవుండగా యింకొకళ్లెందుకు రా నివ్వాలి నువ్వు?" అన్నాడు.

"చాల్లేండి. మీరూ నన్ను బాగానే ఆడిస్తున్నారు! ఇంటి కొచ్చిన మనిషిని అంత నిర్మొహమాటంగా యెట్లా పొమ్మన మంటారు? రేపెప్పుడన్నా మీరు వొస్తే అంతే చెయ్య మంటారా?" అని నవ్వుతూ చీపురు తెచ్చి పరపర వూడ్చ నారంభించింది.

రామయ్య యిక మాట్లాడలేదు.. తన లాపాయిట్లు కస్తూరిమీద పనిచెయ్యవని తెలుసుకున్నాడు.

మర్నాటి వుదయమే రామయ్య అద్దెలెక్కచూసి ఇచ్చాడు కస్తూరికి. 'నెలరోజులు వుంటామంటారుగా?' అన్నది కస్తూరి.

కేసులన్నీ దీర్ఘ వాయిదాలు పడ్డయి సాయంత్రమే ఇంటికి పోతాను." అన్నాడు. కస్తూరి మాట్లాడలేదు. రామయ్య పోయిన వేపు చూస్తూ నిట్టూర్చింది.

కాని సాయంత్రానికి రామయ్య మళ్లీ తయారయ్యాడు!

"వూరికి పోలేదేం?" అన్నది, పొయిదగ్గర కూర్చుని యెసరు పెడుతున్న కస్తూరి.

"సమన్లవి తేయించటానికి యింకా కొన్నాళ్ళు వుండా లన్నాడు ప్లీడరు."

కస్తూరి యిక మాట్లాడలేదు. నిట్టూర్చి యింకో సోలెడు బియ్యం తెచ్చి యెసట్లో వేసింది.